క్లుప్తంగా

నేడు వేణుగోపాలస్వామి కళ్యాణం



గజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో గల ఆళ్వారాజుల సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారికి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పండితులు శ్రీధర్‌బాబు, రంగయ్యలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణం అనంతరం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.



ఎండదెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి



ఎండకు ప్రయాణం చేయలేక రోడ్డు పక్కన ఆపిన లారీలు

ఎండలు బాబోయ్.. ఎండలు..!

ఒంగోలు రూరల్: మండుతున్న ఎండలకు తట్టుకోలేక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ప్రధానంగా రవాణా వ్యవస్థపై ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఎండవేడిమి ప్రభావానికి తట్టుకోలేక ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి సైతం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. ఎక్కడికక్కడే లారీలు, మినీ లారీలు, ఇతర వాహనాలను రోడ్డు పక్కన ఆపేసి ఎండదెబ్బ నుంచి తప్పించుకునే మార్గాలు వెతుకుతున్నారు. కొందరు రోడ్డు మార్జిన్‌లో వాహనాలను నిలిపివేసుకుని దాబాల్లో, చెట్ల కింద సేదతీరుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలులోని త్రోవగుంట ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి ముదిగొండి వాగు వరకు ఎక్కడా రోడ్డుపై వాహనాలు కనిపించలేదు. అదే సమయంలో రోడ్డుపక్కన తాటిముంజలు, శీతలపానీయాలతో తాత్కాలిక ఉపశమనం పొందడం కనిపించింది.



తాటిముంజలు కొనుగోలు చేస్తున్న వాహనదారులు

గంగమ్మ తల్లి వార్షికోత్సవాలు ప్రారంభం

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంటపాలెంలో వెలసి ఉన్న గంగమ్మ తల్లి దేవస్థానం 11వ వార్షికోత్సవాలను శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గంగమ్మ తల్లికి నిర్వహించిన అభిషేక మహోత్సవం నేత్రోత్సవంగా సాగింది. నిర్వాహకులు అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంధం, విభూది, కుంకుమతో పాటు వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాన్ని నయనానందకరంగా జరిపించారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిసి లోకం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షిస్తూ గంగమ్మ తల్లిని వేడుకుంటూ అభిషేకాన్ని నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు.



గంగమ్మ తల్లికి అభిషేకం చేస్తున్న భక్తులు

మండలంలో ప్రశాంత వాతావరణం ఉండాలి

మద్దిపాడు: ఇటీవల జరిగిన ఎన్నికల పోలింగ్ అనంతరం రాష్ట్రంలో కొన్ని చోట్ల హింసాయుత చర్యలు జరిగాయని, అటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రతిఒక్కరూ కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మద్దిపాడు ఎస్సీకాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ప్రశాంత వాతావరణం నెలకొనేంత వరకూ పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ట్రబుల్ మంగర్స్, రౌడీషీటర్లపై దృష్టి ఉంచామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీకాలనీలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి వాటిని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ వి.మహేష్, నాగులుప్పలపాడు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిపాడు ఎస్సీకాలనీలో స్వాధీనం చేసుకున్న బైకులతో రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్‌ఐలు

బాలినేనిని కలిసిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు



బాలినేనితో చర్చిస్తున్న బిల్లా చెన్నయ్య, తదితరులు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య శుక్రవారం తన బృందంతో హైదరాబాద్‌లో కలిసారు. ఒంగోలు నియోజకవర్గంతో పాటు జిల్లాలో పోలింగ్ జరిగిన తీరుపై చర్చించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రిగా మళ్లీ బాలినేని సేవలందించాలని ఆకాంక్షించారు. పలు విషయాలపై చర్చించారు.

ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీకి జాతీయ స్థాయి గుర్తింపు

కొత్తపట్నం: తీరప్రాంత గ్రామమైన ఈతముక్కలలోని ఉలిచి వెంకారెడ్డి, సీతారావమ్మ మహిళా పాలిటెక్నిక్ కాలేజీకి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. న్యూఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ ఎన్‌బీఏ ఎక్స్‌పర్ట్ బృందం అధికారులు శుక్రవారం కళాశాలను సందర్శించారు. గత మూడేళ్లగా కాలేజీలో కల్పించిన అన్ని సదుపాయాలను పరిశీలించారు. ల్యాబ్‌లో పరికరాలు, అధ్యాపకులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, ప్రస్తుత పరిస్థితులకు తగిన శిక్షణతో ఎంత మంది విద్యార్థులు ఉపాధి పొందారు, హాస్టల్లో సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు, విద్యార్థులు- అధ్యాపకుల నిష్పత్తి శాతం, ఉత్తీర్ణత శాతం, క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆసక్తి తదితర అంశాలను న్యాక్ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. జాతీయ స్థాయికి ఎంపిక చేయడానికి తగిన విధంగా కళాశాల ఉందని సంతృప్తి వ్యక్తం చేసింది. కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఎంబీఏ 2024-27 బ్యాచ్‌కు అనుమతి ఇచ్చారు. ఎంబీఏకు అనుమతి రావడంపై కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాదరావును అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



కాలేజీ సందర్శనకు వచ్చిన న్యాక్ బృందం

ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలి

మద్దిపాడు: మండలంలో ఉపాధి కోరిన ప్రతి కూలీకి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పని కల్పించాలని ఏపీడీ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని లింగంగుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీడ కల్పించాలని, వారి వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించాలని, ప్రతిఒక్కరూ రూ.280 కూలి పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ధనంజయవర్మ ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

గంగ తిరునాళ్లు ప్రారంభం

పీసీ పల్లి: మండల పరిధిలోని వెంగళాపురం గ్రామంలో గల పాలేటి గంగమ్మ తిరునాళ్లు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రాతఃకాలమునే ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 5 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనుండగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులు రాలేదని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: మరమ్మతుల నిమిత్తం శనివారం చీమకుర్తి, ఆర్ఎల్ పురం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలపాడు 33 కేవీలో పీఎంఐ వర్క్ జరుగుతున్న కారణంగా చీమకుర్తి, నార్త్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.